చట్టాల పేరుతో ఇబ్బంది పెట్టొద్దు

- అటవీశాఖ అధికారులకు డిప్యూటీ సీఎం రాజన్నదొర సూచన

మహానంది: చట్టాల పేరుతో గిరిజనులను ఇబ్బంది పెట్టొద్దని డిప్యూటీ సీఎం రాజన్న దొర అధికారులకు సూచించారు. మహానందీశ్వరుడి దర్శనార్థం శుక్రవారం సాయంత్రం నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డితో కలిసి వచ్చారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాల మహేశ్వర్‌రెడ్డి, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునలు వారికి స్వాగతం పలికారు. కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం డిప్యూటీ సీఎం రాజన్నదొర విలేకరులతో మాట్లాడుతూ అడవిలో పుట్టి, పెరిగి, అడవిలోనే ప్రాణాలొదిలే పేద గిరిజనులను అటవీశాఖ అధికారులు చట్టాల పేరుతో ఇబ్బందులు పెట్టడం పద్ధతికాదన్నారు. రాష్ట్రంలో పలు చోట్ల గిరిజనులు ఇళ్లు కావాలని అడుగుతున్నారని, సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. టీడీపీ హయాంలో గిరిజనులకు ఇచ్చిన సబ్సిడీ పథకాలన్ని సొంతపార్టీ వారికే దక్కాయని, పేద గిరిజనులకు అందింది శూన్యమన్నారు. కానీ నేడు ఎక్కడా పైసా అవినీతి లేకుండా పాలన సాగిస్తుంటే రోడ్లపేరుతో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ నెల 29న మూడో విడత ఆసరా పథకం విడుదల చేయనున్నట్లు చెప్పారు. పట్టాలిచ్చి, బోర్లు వేసుకోనివ్వడం లేదంటూ మహానంది గిరిజనులు డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఇళ్లకు సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని తహసీల్దార్ జనార్దన్‌శెట్టిని ఆదేశించారు.


గిరిజనుల సమస్యలు వింటున్న డిప్యూటీ సీఎం రాజన్న దొర

నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

మహానందిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను డిప్యూటీ సీఎం రాజన్నదొర, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిలు తనిఖీ చేశారు. విద్యార్థులతో పలు అంశాలపై ముచ్చటించారు. రాజన్నదొర మాట్లాడుతూ విద్యార్థులకు ఏ చిన్న అనారోగ్యం వచ్చినా వెంటనే వైద్యసేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. నాసిరకంగా నిర్మించిన డార్మెటరీ నిర్మాణంపై విచారణ జరపాలని గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీని ఫోన్లో ఆదేశించారు. ఎంపీ నిధులతో విద్యార్థుల సౌకర్యం కోసం డార్మెటరీ నిర్మిస్తానని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యా శంకర్‌నాయక్, గిరిజన ప్రజాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్, బంజార ధర్మసేన రాష్ట్ర అధ్యక్షుడు రత్నవత్ రాజారామ్‌నాయక్, ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్ప, జీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవినాయక్, ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బాలునాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న వీఏఏ

పాములపాడు: విత్తనశుద్ధితో అధిక దిగుబడులు సాధించవచ్చని గ్రామ వ్యవసాయ సహాయకుడు షాజిద్‌బాషా రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఎర్రగూడూరు గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆముదం, అలసంద, జొన్న, సజ్జ పంటల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మినుము పంటలలో రసం పీల్చే పురుగు నివారణకు పసుపు, నీలం రంగు జిగురు అట్టలను ఎకరాకు 10 ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ దాసు

మిడుతూరు: పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీకి కావాల్సిన స్థలం విషయమై శుక్రవారం తహసీల్దార్ సిరాజుద్దీన్‌తో కలిసి ఆర్డీఓ ఎం దాసు నాగలూటి గ్రామంలో పరిశీలించారు. 177 సర్వే నంబర్‌లో 2.50 ఎకరాల విస్తీర్ణంతో పిరమిడ్ ధ్యాన మందిరం, ధ్యాన మందిరానికి వసతి సౌకర్య గదులు, భోజనశాల, పార్కింగ్ స్థలం తదితర మౌలిక సదుపాయాల కల్పనకు, వృద్ధాశ్రమం నిర్మించేందుకు స్థలం మంజూరుచేయాలని సర్పంచ్ ఉషారాణి, పిరమిడ్ ధ్యాన మందిర కమిటీ సభ్యులు విన్నవించడంతో అధికారులు గ్రామానికి చేరుకుని పరిశీలించారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

పగిద్యాల: జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ వెంకటరమణ ఆదేశించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మార్చి 27లోగా ప్రతి లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 207 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. త్వరగా పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. పనులు ప్రారంభించని లబ్ధిదారులకు నోటీసులు జారీ చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ జ్యోతి పాల్గొన్నారు.

పోరుబాట పోస్టర్ విడుదల

ఆత్మకూరు: స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆపార్టీ పోరుబాట పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. పార్టీ తాలూకా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు సంతకాల సేకరణ, రౌండ్‌టేబుల్ సమావేశాలు, కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల 22న విజయవాడలో మహాధర్నా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటశివుడు, చాంద్‌బాషా, ఓబులేసు, లాలు, ఖాదర్‌బాషా, అన్వర్‌బాషా, ముర్తుజాబీ పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు త్వరలో పూర్తి


పనులు పరిశీలిస్తున్న ఈఓ, చైర్మన్‌లు

మహానంది: మహానందిలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి స్వంత నిధులతో చేపడుతున్న సుందరీకరణ పనులు త్వరలోనే పూర్తి చేస్తామని ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా పాల మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునలతో కలిసి శుక్రవారం సాయంత్రం ఆయన పనులు పరిశీలించారు. వారి వెంట ఆలయ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ ఉన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

బండిఆత్మకూరు: నాయిని చెరువు చెంచుగూడెంలో వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓఆర్డీ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఇటీవల జిల్లా కలెక్టర్ స్వయంగా ఈ గూడేన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించారు. వీధి దీపాలు సక్రమంగా లేకపోవడంతో వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించడంతో వారు చర్యలు తీసుకున్నారు.

ఉగాది నాటికి పూర్తి చేసుకోవాలి

మిడుతూరు: జగనన్న కాలనీలలో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ జీఎన్ ఎస్ రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దీన్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పీరుసాహెబ్‌పేట గ్రామంలోని జగనన్న లే అవుట్‌ను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులను అభినందించారు. మిగతా వారు కూడా త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అధికారుల వెంట సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ రమేష్, పీఎస్ వినోద్, వీఆర్వో ఆంజనేయులు ఉన్నారు.

సమగ్రంగా సర్వే


పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ కిరణ్‌కుమార్

బండిఆత్మకూరు: నంద్యాల-కల్వకుర్తి జాతీయ రహదారి 167కే సర్వే పనులు సమగ్రంగా చేపట్టినట్లు సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం బండిఆత్మకూరు, పార్నపల్లె గ్రామాల మధ్య చేపట్టనున్న జాతీయ రహదారిని పరిశీలించారు. 476, 478 సర్వే నంబర్లలో కొలతలు వేసి తనిఖీ చేశారు. ఆయన వెంట సర్వేయర్ శివప్రసాద్, వీఆర్ఓ ఏసుపాదం ఉన్నారు.

సేవలతోనే గుర్తింపు

మహానంది: సేవా కార్యక్రమాలతోనే యువతకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని సెయింట్ ఆన్స్ మనోవికాస్ సేవా కేంద్రం ప్రిన్సిపాల్ సిస్టర్ రీనా జోష్ అన్నారు. మహాజన సోషలిస్ట్ పార్టీ మండల ఇన్‌చార్జ్‌లు నరసింహులు మాదిగ, చెవుల వెంకటసుబ్బయ్య మాదిగల ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో యూత్ విభాగం నాయకులు రవికృష్ణ, పుల్లా నరసింహ, వెంకటరమణ, శంకర్, చంద్ర, జయనరసింహ, మాస్టర్, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా పోలీసుపై దాడికి నిరసన


నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

ఆత్మకూరు రూరల్: మండల పరిధిలోని వడ్లరామాపురం గ్రామ సచివాలయం మహిళా పోలీసు శివరాణిపై అదే గ్రామానికి చెందిన కొందరు దాడిచేయడంపై సచివాలయ సిబ్బంది శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మోహన్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు షఫివుల్లా, మునావర్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

ఆత్మకూరు: మండలంలోని జగన్న కాలనీలలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని కృష్ణాపురం, పిన్నాపురం, శ్రీపతిరావుపేట గ్రామాల్లో శుక్రవారం జగనన్న కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. రహదారులు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సువత్సల, పంచాయతీ కార్యదర్శి బాలునాయక్ పాల్గొన్నారు


జగనన్న కాలనీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఎమ్మెల్యేపై ఆరోపణల సరికాదు

వెలుగోడు: రైతుల కోసం శ్రమించే ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిపై సాగునీటి విషయంలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అసత్య ఆరోపణలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, సర్పంచ్ వేల్పుల జయపాల్, పార్టీ నాయకులతో కలిసి ప్రభాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. మద్రాస్ కాల్వ లైనింగ్ పనుల కోసం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి గతేడాది రైతులను ఒప్పించి పనులు చేపట్టారన్నారు. గతేడాది వీబీఆర్ నుంచి వన్ తూము ద్వారా ప్రత్యేక మోటార్లు ఏర్పాటు చేయించి సాగునీరు ఇప్పించారన్నారు. ఈ ఏడాది కూడా రబీకి ఏప్రిల్ 15 వరకు నీరు ఇస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో అభివృద్ధి జరగడం లేదని విమర్శలు చేసే నాయకులు డిబేట్‌కు సిద్ధమా అని సవాలు విసిరారు. వలంటీర్ వ్యవస్థపై విమర్శలు చేయడం, అడ్డగోలుగా పిచ్చి రాతలు రాయడం మానుకోవాలని టీడీపీ అనుకూల మీడియాకు హితవు పలికారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, వైస్ ఎంపీపీ నసిరుద్దీన్, నాయకులు శంకర్ నాయక్, గోవిందు, షంషీర్ అలీ, రామ్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చాంద్‌బాషా, ఆరీఫ్, తెలుగు వెంకటరమణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు

మహానందీశ్వర దంపతులకు పల్లకీసేవ

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లు శుక్రవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు, పండితులు స్వామివార్ల ఉత్సవమూర్తులను అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం వైభవంగా చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ పాల్గొన్నారు.


పల్లకీసేవలో పాల్గొన్న ఈఓ, భక్తులు

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

జూపాడుబంగ్లా: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆత్మకూరు ఆర్డీఓ ఎం దాసు శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. సర్వే నంబర్ 711కు సంబంధించి రికార్డులు కావాలని కోరగా రెవెన్యూ అధికారులు ఇవ్వలేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామకంఠకం భూములు పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో ఉంటాయని, వాటి సంరక్షణ బాధ్యత కూడా వారిదేనన్నారు. గ్రామకంఠకంలో ఉన్న భూములకు పట్టాలిచ్చే హక్కు తమకు లేదన్నారు. అలా జరిగి ఉంటే తన దృష్టికి తీసుకువస్తే రద్దు చేస్తానన్నారు. స్పందన అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, డిప్యూటీ తహసీల్దార్లు చంద్రశేఖర్, నాగన్న ఉన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం దాసు

వాటర్ ప్లాంట్ల నిర్వహణలో నిబంధనలు పాటించాలి

జూపాడుబంగ్లా: నిబంధనలకు వ్యతిరేకంగా, అనుమతుల్లేకుండా వాటర్‌ప్లాంట్లు నిర్వహిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈ చంద్రశేఖర్, ఎస్ఐ హనుమంతయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని మినరల్ వాటర్ ప్లాంట్లను తనిఖీ చేశారు. ప్లాంట్ల నిర్వహణ, నీటిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, నీళ్లల్లో కలిపేమినరల్స్, కెమికల్స్‌ను పరిశీలించారు. నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సేఫ్టీ వాటర్‌ప్లాంట్ యజమానికి రూ.15 వేల జరిమానా విధించారు. తనిఖీల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కానిస్టేబుల్ రామచంద్ర, పట్టణ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీత పాల్గొన్నారు.


అరుద్ర వాటర్ ప్లాంట్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఎరువుల దుకాణాల తనిఖీ


ఎరువులను పరిశీలిస్తున్న ఇంటర్నల్ స్క్వాడ్ ఏడీఏ ఆంజనేయ

మిడుతూరు: స్థానిక కిసాన్ అగ్రిమాల్, మన గ్రోమోర్ కేంద్రాన్ని ఇంటర్నల్ స్క్వాడ్, ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేశారు. వివరాలు సరిగా లేకపోవడంతో మన గ్రోమోర్ కేంద్రంలో రూ.34,9703, కిసాన్ అగ్రిమాల్‌లో రూ.11,27,522 విలువ చేసే ఎరువుల విక్రయాలను నిలిపేయాలని నిర్వాహకులను ఏడీఏ ఆదేశించారు. తనిఖీ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆయన విలేకరులకు తెలిపారు. ఏడీఏ వెంట ఏఓ పీరునాయక్ ఉన్నారు.

మహానందిలో పాము కలకలం

మహానంది: మహానంది దేవస్థానంలోని చిన్న గేటు వద్ద భక్తులు వచ్చే దారిలో శుక్రవారం సాయంత్రం పాము కనిపించడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. దర్శనం అనంతరం రాకపోకలు సాగిస్తున్న భక్తులు పామును చూసి పరుగులు తీశారు. పాము సమీపంలోని బైకుల మధ్యకు వెళ్లడంతో స్థానికులు కర్ర సాయంతో చాకచక్యంగా పట్టుకుని కాలువలో వదిలేశారు.


బైకుల మధ్య పాము

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ తిరుపాలమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు కురుకుంద శంకర్‌రెడ్డితో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనకు అనుకూలమైన పత్రికల్లో తప్పుడు రాతలు రాయించడం సరికాదన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల్లా లంచాలు తీసుకుని వలంటీర్లు పనిచేయడం లేదన్నారు. ప్రజలపట్ల బాధ్యతతో, ప్రభుత్వం పట్ల విశ్వాసంతో పనిచేస్తున్నారన్నారు. 700లకు పైగా సేవలు అందిస్తున్న వలంటీర్ వ్యవస్థపై విషపు రాతలు రాయించి జర్నలిజం పరువును మంటకలిపారన్నారు. టీడీపీ హయాంలో ఏనాడైనా 1వ తేదీనే పింఛన్ ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రజాసేవ చేస్తున్న వలంటీర్లపై దుష్ప్రచారం చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుల్తాన్, జయకృష్ణ, భాస్కర్, గౌసిలాజం, సయ్యద్‌మీర్, మాబు, మౌలాలి, విజయ్, బాలస్వామి, రాజేష్, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్. చిత్రంలో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు

నేడు విద్యుత్ కోత

ఆత్మకూరు: పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాను కొన్ని గంటల పాటు నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్‌సరఫరాను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేస్తున్నామన్నారు. అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలి

జూపాడుబంగ్లా: నిరుద్యోగ యువతీయువకులు స్వయం ఉపాధిరంగాల్లో రాణిస్తూ జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి పీవీ ప్రతాపరెడ్డి సూచించారు. శుక్రవారం నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 30 మంది నిరుద్యోగ యువకులకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి, మరమ్మతులు, యాజమాన్య పద్ధతులపై ఉచిత శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా శిక్షణాధికారి పీవీ ప్రతాపరెడ్డి మాట్లాడుతూ మూడు మాసాల పాటు ఉచితంగా నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వడంతో పాటు శిక్షణ అనంతరం వారికి సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనపబరిచే వారికి ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, కోఆర్డినేటర్ వెంకటరమణ, గ్రీన్‌కో సోలార్ కంపెనీ సిబ్బంది నరహరి, శివప్రసాదు పాల్గొన్నారు.

నెట్‌సెంటర్ నిర్వాహకుడి అరెస్ట్

జూపాడుబంగ్లా: నిరుద్యోగులతో చెలగాటం ఆడిన నెట్ సెంటర్ నిర్వాహకుడు సయ్యద్ అమీర్‌బాషాను నందికొట్కూరు పట్టణ సీఐ విజయభాస్కర్ శుక్రవారం అరెస్ట్ చేశారు. కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఆన్‌లైన్ చేస్తానని 36 మంది నిరుద్యోగుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.400ల చొప్పున తీసుకొని ఆన్‌లైన్ చేయకుండా మోసం చేశాడు. కొంత మందికి నకిలీ రశీదులు అంటగట్టి మోసగించాడు. ఈ విషయమై బాధితులు నందికొట్కూరు సీఐకి ఫిర్యాదు చేయగా ఆయన కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు సయ్యద్ అమీర్‌బాషాను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి అతన్ని రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

మహానంది జలసంపద అద్భుతం


మహానందీశ్వరస్వామి సన్నిధిలో జర్మన్లు

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో జలసంపద అద్భుతమని జర్మనీ దేశానికి చెందిన ఈషా, నిషన్ తెలిపారు. మహానందీశ్వరుడి దర్శనార్థం శుక్రవారం రాత్రి వారు మహానందికి వచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఆలయాల సందర్శనలో భాగంగా మహానందికి వచ్చినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఆలయాలు అద్భుతంగా ఉన్నాయని, శిల్ప సంపద ప్రత్యేకంగా ఆకట్టుకుంటుందని చెప్పారు. మహానంది నుంచి యాగంటి, హంపీ వెళ్లనున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయండి

ఆత్మకూరు: రైతు వ్యతిరేక పాలన సాగిస్తున్న కేంద్రప్రభుత్వం తీరును నిరసిస్తూ ఈ నెల 26న నంద్యాల పట్టణంలో నిర్వహించనున్న ట్రాక్టర్ల ర్యాలీని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు రాజశేఖర్, యాదాది నాగేంద్రుడు కోరారు. ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం స్థానిక సుదర్శనవర్మ భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడా కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ రైతులు, కార్మికుల సంక్షేమాన్ని మోదీ ప్రభుత్వం విస్మరించిందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నరసింహనాయక్, రణధీర్, రామ్‌నాయక్, అంబయ్య, స్వాములు పాల్గొన్నారు.


పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు

మల్లన్నకు నృత్యనివేదన



నృత్యప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం రెండవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై నిర్వహించిన సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను అలరించింది. వినాయకకౌత్వం, ఓం నమఃశివాయ, హిమగిరితనయ శివతాండవం, శివాష్టకం తదితర గీతాలకు కె.నిహారికసాయి, కె.శ్రేయ, కె.తరుణి, సి.స్వాతి, జె.అంజలి, రక్షిత, అనిత, లాస్యప్రియ, వర్షిక తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

ఆకట్టుకున్న భజన

శ్రీశైలంటెంపుల్: ఆలయ దక్షిణమాఢవీధిలో నిత్యకళారాధన వేదికపై గాజులపల్లికి చెందిన ఎస్.రామతులసీ, బృందం వారిచే శుక్రవారం నిర్వహించిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది. స్వామి, అమ్మవార్లను స్తుతిస్తూ భక్తిగీతాలు, అష్టకాలను ఎ.కొండారెడ్డి, బి.రామనాయుడు, వి.నాగేశ్వరరావు, డి.సురేష్, కె.ధనుంజయ, ఎ.జయరాముడు, వి.బాలరంగప్ప, తిప్పయ్య, జి.చంద్రప్ప, ఎస్.పెద్దపుల్లమ్మ, ఎస్.రంగయ్య, పి.నరశింహుడు తదితరులు ఆలపించారు.



భక్తి గీతం ఆలపిస్తున్న కళాకారులు

క్యాలెండర్ ఆవిష్కరణ

జూపాడుబంగ్లా: స్థానిక సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కార్యాలయంలో శుక్రవారం ఐఎఫ్‌టీయూ 2023 క్యాలెండర్‌ను యూనియన్ డివిజన్ అధ్యక్షుడు మౌలాలి, ప్రధాన కార్యదర్శి మజీద్‌మియ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు లాజరస్, ఎం.శిరీష, నవీన్‌కుమార్, అల్లిఖాన్ తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

తవ్వేస్తున్నారు

- తర్తూరు మహమ్మద్‌ఖాన్ కుంటలో అక్రమంగా మట్టి తవ్వకాలు

జూపాడుబంగ్లా: తర్తూరు రెవెన్యూ పరిధిలోని మహమ్మద్‌ఖాన్ కుంటలో అక్రమంగా మట్టిని తవ్వి యథేచ్ఛగా విక్రయాలు చేస్తున్నా పట్టించుకొనేనాథుడే కరువయ్యారు. మైనర్‌ఇరిగేషన్ పరిధిలో ఉన్న మహమ్మద్‌ఖాన్ కుంటలో జేసీబీని పెట్టి నాలుగు ట్రాక్టర్లతో మూడు రోజుల నుంచి మట్టిని తవ్వి విక్రయించుకొని సొమ్ముచేసుకొంటున్నారు. మూడు రోజుల్లో దాదాపు రూ.50 వేల విలువ చేసే మట్టిని తరలించినట్లు ఆరోపణలున్నాయి. కుంటలో అక్రమ తవ్వకాల విషయమై మైనర్ ఇరిగేషన్ ఏఈ రామ్మోహన్‌రెడ్డి వివరణ కోరగా తనకు తెలియదని, తామెవరికీ అనుమతి ఇవ్వలేదని తెలిపారు. మట్టి తవ్వుతున్న హర్షవర్ధన్‌ను వివరణ కోరగా తహసీల్దార్ పుల్లయ్యాయాదవ్ అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. తహసీల్దార్ పుల్లయ్యాయాదవ్‌ను వివరణ కోరగా లిఖితపూర్వకంగా ఎలాంటి అనుమతిని ఇవ్వలేదని చెప్పారు


మట్టిని తవ్వి ట్రాక్టర్‌లో వేస్తున్న జేసీబీ